క్లుప్తంగా

సైకత లింగానికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సైకతలింగం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకతలింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అలాగే రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు, చండీమాతకు, శ్రీచక్రానికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రిటైర్డు ఆంధ్ర బ్యాంకు మేనేజర్ మూలె వెంకటరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మీదేవి, కుమారులు శ్రీకాంత్‌రెడ్డి, సుమంత్ రెడ్డి, కోడళ్లు లక్ష్మీప్రియ, అంబర్, కుమార్తె జ్యోతి ఈ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూలె శ్రీకాంత్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీప్రియ, మూలె అర్జున్ రెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణరెడ్డి, ఎంవీ నారాయణ, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి, లింగారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి సభ్యులు

పులివెందుల టౌన్ : త్రిమత ఏకైక గురువు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని రచ్చుమర్రిపల్లె, తుమ్మలపల్లె, రాయలాపురం గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి, జ్ఞానవేదిక పులివెందుల కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. జీవాత్మ, పరమాత్మ ఆత్మల వివరణ తెలుసుకొనుట వలన మధ్యాత్మ ఆరాధనలో ధర్మముల స్థాపన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానవేదిక పులివెందుల కమిటీ అధ్యక్షులు వరుణ్‌కుమార్, సభ్యులు నాగమల్లేషు, మహిధర్, గురుమూర్తి, హరిశివ, వెంకటయ్య, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలిద్దాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య

వేముల: మలేరియా నిర్మూలన అందరి సహకారంతో సాధ్యమని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వేల్పుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేల్పులలో మలేరియా మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ దోమ పుట్టుకను నివారించాలని, దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా నిర్ధారించి వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్తచెదారాలను తొలగింపజేయడంతో పాటు మొక్కలు, నీటి కుండీలు, రుబ్బురోళ్లలో ఉన్న నీటి నిల్వలను తొలగింపచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వీణాకుమారి, ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరి, ఆశాకార్యకర్త లక్ష్మిదేవి పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండా వధూత ఆశ్రమం, గోవిందయ్యమఠం ఆవరణలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి సి.శివయ్య, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

ఆరు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అంకురార్పణ, నవ కలశస్వపనం, అభిషేకం, 11వ తేదీ ఉదయం ధ్వజారోహణం, కుంభప్రతిష్ఠ, నిత్యహోమం, సాయంత్రం శేషవాహనంపై గుడి ఉత్సవం, 12వ తేదీ ఉదయం చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, సాయంత్రం ఎదురుకోళ్ళు, 13వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం హనమంత వాహనసేవ, 14వ తేదీ ఉదయం మూలమూర్తిహోమం, ఉత్సవబలి, సాయంత్రం గరుడవాహనంపై గ్రామోత్సవం, 15వ తేదీ ఉదయం అశ్వవాహనసేవ, చక్రస్నానము, సాయంత్రం ధ్వజావరోహణం, అనంతరం పుష్పయాగము కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల అంకురార్పణ సందర్భంగా పుట్టమట్టిని ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, శ్రీధర్, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



పుట్టమట్టిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తున్న ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు

50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువులు

మైదుకూరు : రైతులకు వ్యవసాయ శాఖ 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్టె ఎరువుల విత్తనాలను అందిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మండలానికి 220 క్వింటాళ్ల జనుములు, 5 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలను కేటాయించినట్లు ఏఓ పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఆర్‌బీకేలలో పచ్చిరొట్టె విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. జనుములు 10 కిలోల పూర్తి ధర రూ.880లని, 50 శాతం సబ్సిడీ పోను రూ.440 రైతులు చెల్లించాలని, పిల్లి పెసర 10 కిలోల పూర్తి ధర రూ.1340లని, సబ్సిడీ పోను రూ.670 రైతులు చెల్లించాలని వివరించారు. పచ్చిరొట్టె ఎరువుల విత్తనాలు కావాల్సిన రైతులు తప్పనిసరిగా పాస్ బుక్, 1బీ, ఆధార్ జిరాక్స్, సెల్‌ఫోన్ తీసుకుని ఆర్‌బీకేల వద్దకు పోవాలని సూచించారు. జనుము విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బు చెల్లించిన 7-10 రోజుల లోపు వ్యవసాయశాఖ నుంచి ఆర్‌బీకేల ద్వారా రైతులకు నేరుగా అందజేస్తామని ఏఓ తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అనధికారిక నిర్మాణాలపై చర్యలేవీ?

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగర పాలక సంస్థ పరిధిలో అనధికార నిర్మాణాలపై ఫిర్యాదులు చేస్తున్నా, సిటీ ప్లానింగ్ విభాగం వారు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాల్సింది పోయి, అయిన వారికి, పెద్ద వారికి నోటీసులతో సరిపెట్టడం.. ఒక సెంటు, రెండు సెంట్లలో సామాన్యుల ఇళ్ల నిర్మాణాలను కూల్చేస్తున్నందున పలు విమర్శలకు తావిస్తోందన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పీఎండీ నజీర్

ప్రొద్దుటూరు క్రైం : అసాంఘిక కార్యకలాపాలపై ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఉక్కుపాదం మోపాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ తెలిపారు. ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్రికెట్ బెట్టింగ్, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిని పార్టీలో చేర్చుకోవద్దని ఎమ్మెల్యేను కోరారు. తాను కూడా పెద్దాయన శిష్యుడినేనని, అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నట్లు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన వరదరాజులరెడ్డికి కాంగ్రెస్ పార్టీ తరఫున అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఆరు సార్లు గెలిచిన పెద్దాయనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ప్రొద్దుటూరు అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సహకారం అందిస్తుందని చెప్పారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు జిలానిబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందని కడప వక్కలపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నజీబుల్లా అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం వక్కలపేటలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేస్తూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై అవగాహన కల్పించారు. మీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి మేమంతా సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులతోపాటు ఆటస్థలం, మరుగుదొడ్ల సౌకర్యం ఉందన్నారు.

హైలెవెల్ వంతెన నిర్మించండి



అర్కటవేముల-పొట్టిపాడు రహదారిలో వంకపై ఉన్న లోలెవెల్ వంతెన

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల-పొట్టిపాడు గ్రామాలకు వెళ్లే రహదారిలో మడువంకపై హైలెవెల్ వంతెన నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలంలో అయితే ఈ లోలెవెల్ వంతెనపై నాలుగు అడుగుల మేర నీరు పారుతుంటాదని, దీంతో వాహనదారులు పొట్టిపాడు మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు చెప్పారు. ప్రొద్దుటూరు పట్టణానికి చేరుకోవాలంటే దాదాపు 25 కిలోమీటర్లు చుట్టూ తిరిగి పోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైలెవెల్ వంతెన నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

సర్వీసు నౌ సంస్థతో కేఎస్ఆర్ఎం ఎంఓయూ

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం వారికి సర్వీస్ నౌ సంస్థతో ఎంఓయూ కుదిరినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు సర్వీస్ నౌ వారిచే సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ అందించడం కోసం సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వీస్ నౌ డైరెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ సర్వీస్ నౌ అడ్మినిస్ట్రేషన్ అండ్ అప్లికేషన్ డెవలపర్ కోర్సెస్ చేయడం వల్ల విద్యార్థిని, విద్యార్థులకు అధునాతన సాంకేతిక నైపుణ్యంతోపాటు టీసీఎస్, అసెంచర్, కాప్‌జెమిని లాంటి ఎంఎన్‌సీ కంపెనీస్‌లో ఉపాధి అవకాశాలు పొందడానికి దోహదం చేస్తాయని అన్నారు. ఏపీలోని ప్రైవేటు అటానమస్ కళాశాలలో ఇంటువంటి అవగాహన కార్యక్రమం మొదటిదని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కరస్పాండెంట్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : అక్రమ అడ్మిషన్లు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేటు, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలను దోపిడీ చేస్తున్నాయన్నారు. అలాగే పాఠశాలల్లోనే బుక్స్, యూనిఫాం తదితర వాటిని విక్రయిస్తున్నా.. విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్న పాఠశాలలపై చర్యలు తసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు భాస్కర్, నరేష్, కొండయ్య పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



రాచాయపేటలో డ్రైనేజీ కాలువ నిండిపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు

గోపవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ముఖ్యంగా రాచాయపేటలో డ్రైనేజీ కాలువ పూడికతో నిండిపోయి మురికినీరంతా రోడ్డుపైన ప్రవహిస్తుంది. దీంతో దోమల బెడద అధికమైంది. వర్షాలు పడుతుండటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. రోజుల తరబడి మురికినీరంతా రోడ్డుపైన ప్రవహిస్తుండటంతో రోడ్డుపైన పాదాచారులు నడచాలంటే ఇబ్బందికరంగా మారింది. ఎక్కడపడితే అక్కడ చెత్తచెదారంతో నిండిపోయింది. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా దళితవాడలో అయితే డ్రైనేజీ కాలువ నిండి దుర్వాసన వెదజల్లుతుంది. ఇప్పటికైనా రోడ్డుపైన ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు డ్రైనేజీ కాలువలో పూడిక తీయించి పరిశుభ్రతకు సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల దండయాత్ర

- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- నివారణ చర్యల్లో యంత్రాంగం నిర్లక్ష్యం



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల, మున్సిపల్ పరిధిలో దోమలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకూ దోమలు స్వైర విహారం చేస్తుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. దోమల నివారణ చర్యల్లో మండల, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో దోమకాటుకు గురవుతున్న ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామీణ, మున్సిపాలిటీలో ఖాళీ స్థలాల్లో తుప్పలు, పిచ్చి మొక్కలు పెరగడం దోమల వృద్ధికి కారణమవుతున్నాయి. మలేరియా, విభాగం అధికారుల నిర్వహించిన సర్వేలో ఎనిమిది రకాల దోమలు వృద్ధి చెందుతున్నట్లు గుర్తించారు. కానీ వాటి నిర్మూలించే చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

దోమల విస్తరణ ఇలా..

సాధారణంగా క్యూలెక్స్, ఎనాఫిలస్, ఏడీస్ రకాల దోమలు నివాస ప్రాంతాల్లో పుట్టుకొస్తున్నాయి. గృహాల్లోని పూల కుండీలు, చెట్ల గుబురుల్లో గుడ్లు పెడుతాయి. ఈ దోమలు కుట్టడం వలన డెంగీ, మాలేరియా వ్యాపించే ప్రమాదం ఉంది. మురుగు నీరు నిల్వ ఉండే చోట, కాలువల్లో పుట్టుకొస్తున్నా దోమలు కుడితే చర్మంపై దద్దుర్లు పుట్టి విపరీతమైన మంట వస్తోంది. ఈ దోమలు పరిమాణంలో మామూలు దోమలు కంటే పెద్దవిగా ఉంటాయి. మనుషులపై దాడి చేసినప్పుడు ప్రత్యేకంగా హెపరిన్ అనే హార్మోన్ విడుదల చేస్తాయి. ఇది విడుదల కాగానే కుట్టిన చోట రక్తం పలుచగా అవుతుంది. అప్పుడు మాత్రమే ఈ దోమ నేరుగా రక్తాన్ని తాగడం మొదలు పెడుతుంది. వీటి నివారణకు యంత్రాంగం నిర్మాణాత్మక చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : ఏపీ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రొద్దుటూరు ఏరియా లేబర్ కార్యాలయం ఉద్యోగికి ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి చిన్న ఓబన్న, ఉపాధ్యక్షుడు శేషారెడ్డి, సహాయ కార్యదర్శులు సత్యరాజు, సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల మందికి కార్మిక సంక్షేమ బోర్డు గుర్తుంపు కార్డులు ఉన్నాయన్నారు. కార్డులు పొందని మరో 30 లక్షల మంది కార్మికులు ఉంటారని పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న 40వేల క్లైయిమ్‌లను పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలి



ఏడీఏకు వినతిపత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : కల్తీ ఎరువులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ ఎం.నాగరాజుకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో నిర్వహించిన భూసార పరీక్షల ఫలితాలను ప్రకటించకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని, తక్షణమే ఫలితాలు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున, రూరల్ కార్యదర్శి బాలగురవయ్య, ఉపాధ్యక్షులు యువరాజ్, ఆంజనేయులు, కోశాధికారి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న కోతులు



పల్లెల్లో తిరుగుతున్న కోతులు

గోపవరం : గ్రామీణ ప్రాంత ప్రజలను కోతులు హడలెత్తిస్తున్నాయి. గతంలో పట్టణ ప్రాంతానికే పరిమితమైన కోతులు ఇప్పుడు పల్లెల్లోకి రావడంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒకవైపు రైతులు సాగు చేసిన పంట పొలాలను ధ్వంసం చేయడంతో పాటు ఇళ్లలో చొరబడి ఇష్టానుసారంగా భీభత్సం సృష్టిస్తున్నాయి. అడ్డుకోబోయిన వారిపై దాడులకు దిగడంతో ఇప్పటికే పలువురు ఆసుపత్రుల పాలయ్యారు. పట్టణాల్లో ఉన్న కోతులన్నీ పల్లెలకు సమీపంలో వదలడంతో ఏ పల్లెకు వెళ్లినా వందల సంఖ్యలో కోతులు దర్శనమిస్తున్నాయి. వీధుల్లో వీరవిహారం చేస్తున్నా ఏమీ చేయలేని పరిస్థితి ప్రజలకు ఏర్పడింది. కోతుల బారి నుంచి కాపాడాలని అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈద్గా మైదానంలో వసతులు కల్పించండి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో మాట్లాడుతున్న అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : ఈనెల 17న బక్రీద్ సందర్భంగా కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో వసతులు కల్పించాలని అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కోరారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఈద్గా మైదానంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. మైదానాన్ని శుభ్రపరచడంతోపాటు షామియానాలు, వజు చేసేందుకు నీటి వసతి కల్పించాలని, ప్రత్యేక ప్రార్థనల కోసం మైక్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి ఏడాది లాగే ఈ సారి కూడా బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సూచన మేరకు అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ సభ్యులు మున్సిపల్ రఘునాథరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ సెక్రటరీ ఖురేషి ఇలియాజ్, కమిటీ సభ్యులు మోడంపల్లి షబ్బీర్, ఫైజల్ బాషా, మీరా హుస్సేన్, వీఎస్ షేర్ ఆలీ, మాజీ కౌన్సిలర్ ఖలీల్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసిన అధికారులు

స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని పలువురు అధికారులు, ప్రముఖులు సోమవారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీఓ మురళీధర్, సీనియర్ ఎంవీఐ నారాయణ నాయక్, తహసీల్దార్ విద్యాసాగర్, రెవెన్యూ సిబ్బంది, ఎంఈఓ సావిత్రమ్మ, డీఎల్‌పీఓ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ కుల్లాయమ్మ, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, డాక్టర్ కల్లూరు ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ బుసిరెడ్డి తదితరులు ఎమ్మెల్యే కలిసిన వారిలో ఉన్నారు.

పౌరహక్కుల కోసం నిరంతర పోరాటం

కడప కల్చరల్ : పౌరహక్కుల కోసం బాల గోపాల్ ఉద్యమ స్థాయిలో నిరంతరం పోరాటం చేశారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సోమవారం ప్రముఖ ఆలోచనాశీలి, పౌరహక్కుల కార్యకర్త కె.బాలగోపాల్ 73వ జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, సిబ్బంది నీలకంఠేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏం కొనలేం.. తినలేం..

రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు ఇప్పుడు కూరగాయల ధరలు తోడయ్యాయి. అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలతో పేద, మధ్య తరగతి కొనలేక అవస్థలు పడుతున్నారు. ఏం కొనాలన్నా కిలో రూ.80లు పైమాటే. టమాట పులుపెక్కితే.. మిర్చి ఘాటెక్కింది. కాకర మరింత చేదెక్కింది. రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కొండెక్కిన 'కూరగాయలు'
- టమాటా, పచ్చిమిర్చి పైపైకి
- చుక్కల్లో నిత్యావసరాల ధరలు
- వినియోగదారుల ఆందోళన



మార్కెట్‌లో విక్రయాలకు సిద్ధంగా ఉన్న కూరగాయలు

పులివెందుల రూరల్ : ప్రస్తుత మార్కెట్‌లో కూరగాయలు కొండెక్కి కూర్చున్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఏమీ కొనలేం.. తినలేమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు ఓ మోస్తారులో ఉండే ధరలు నేడు చుక్కలనంటుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లి కూరగాయల ధరలు చూస్తే సామాన్యుల గుండె బరువెక్కిపోతోంది. ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో ఏమీ కొనలేకపోతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. మరోవైపు పప్పుదినుసుల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఏ కూరగాయలు కొనాలన్నా కిలో రూ.80లు పై మాటే పలుకుతున్నాయి. ఇక ప్రైవేట్ వ్యాపారుల గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. ఎండాకాలం పేరిట మరింత ధరలు పెంచి విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 70 శాతం మంది రైతులు కూరగాయల సాగు చేపట్టలేదు.

కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి

వంటింట్లో ఎలాంటి వంటకాలు చేయాలన్నా టమోట, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డలు తప్పనిసరిగా ఉండాలి. రోజువారి వాడకంలో వీటి పాత్ర చాలా కీలకం. వీటిలో మిర్చి ధర ఘాటెక్కిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో మిర్చి రూ.80లు పలుకుతోంది. కిలో టమోట రూ.60, క్యారెట్ రూ.60, కాకర రూ.70, అనపకాయలు రూ.90, చిక్కుడు రూ.80, బీట్‌రూట్, బెండ, బీన్స్ ధరలు రూ.100కు పైగానే ఉన్నాయి. సామాన్య ప్రజలకు పెరిగిన కూరగాయల ధరలు భారంగా మారాయి. కిలోలలో కొనుగోలు చేసేవారు పావు, అరకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

ఏమీ కొనలేని పరిస్థితి



ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. టమోట, పచ్చిమిర్చి కిలో రూ.60 నుంచి రూ.80ల ధరలు పలుకుతున్నాయి. పెరిగిన ధరలతో ఏమీ కొనలేని పరిస్థితి నెలకొంది. కిలోలలో కొనుగోలు చేసేవారు కూడా పావు, అరకిలో కొనుగోలు చేస్తూ సరిపెట్టుకుంటున్నారు.

\- రాజేశ్వరి, గృహిణి

ధరలను నియంత్రించాలి



ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయలు అమాంతంగా పెరిగిపోయాయి. పెరిగిన ధరలను సంబంధిత అధికారులు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలి. రూ.500లు మార్కెట్‌కు తీసుకెళ్తే వారానికి సరిపడు కూరగాయలు రావడం లేదు. కూరగాయల ధరలు మార్కెట్‌లో భగ్గుమంటున్నాయి.

\-హనుమంతురెడ్డి, వినియోగదారుడు